# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 13-11-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **దేశాన్ని వికసిత్ భారత్‌గా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు.**
2. **రాష్ట్ర శాసన సభ సమావేశాల్లో భాగంగా 2024-2025 బడ్జెట్ కేటాయింపులపై ఈరోజు చర్చిస్తున్నారు.**
3. **గ్రామ, వార్డు సచివాలయాలలో మహిళా సంరక్షణా కార్యదర్శుల సేవలను ప్రభుత్వం వినియోగించుకుంటుందని హోం శాఖ మంత్రి వి. అనిత పేర్కొన్నారు.**
4. **కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు.**
5. **రాష్ట్రంలో నిర్వహించనున్న గ్రూప్-2 ప్రధాన పరీక్షను వాయిదా వేసినట్లు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తెలిపింది.**

==========================

దేశాన్ని వికసిత్ భారత్ గా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. బీహార్‌లోని దర్భంగాలో 12 వేల కోట్ల రూపాయలతో నిర్మించనున్న పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధానమంత్రి ఈరోజు ప్రారంభించారు. అలాగే దేశవ్యాప్తంగా 18 ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన ప్రధాన్ మంత్రి భారతీయ జనౌషధి కేంద్రాలను దృశ్య మాధ్యమం ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ,

వాయిస్ (25 సెకన్లు)

---------------------------

ఆంధ్రప్రదేశ్ శాసన సభ బడ్జెట్ సమావేశాలు ఈరోజు తిరిగి ప్రారంభమైయ్యాయి. సభ ప్రారంభం కాగానే, సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్యానెల్ శాసన సభాపతులను ప్రకటించారు. గతంలో నామినేట్ చేసిన మండలి బుద్ధ ప్రసాద్, వరదరాజుల రెడ్డి, జ్యోతుల నెహ్రూ, లలిత కుమారి, దాసరి సుధ, విష్ణుకుమార్ రాజు ప్యానెల్ స్పీకర్లు గా కొనసాగుతారని తెలిపారు. అలాగే 2024-25 వార్షిక బడ్జెట్ కు సంబంధించిన నిధుల కేటాయింపుపై అభ్యంతరాలను ఈ సాయంత్రం లోగా సభ్యులు సమర్పించవచ్చని సభాపతి పేర్కొన్నారు.

---

రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాలలో మహిళా సంరక్షణా కార్యదర్శుల సేవలను ప్రభుత్వం గరిష్ట స్థాయిలో వినియోగించుకుంటుందని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. మహిళా సంరక్షణ కార్యదర్శుల సేవలను వినియోగించుకునే అంశాన్ని శాసన సభలో ఈరోజు పలువురు సభ్యులు ప్రస్తావించి, వీరి సేవలకు సంబంధించి ప్రభుత్వం ఉద్యోగ కార్డు వివరాలు తెలియజేయాలని కోరారు. ఇందుకు మంత్రి సమాధానం చెబుతూ.... మహిళా సంరక్షణ కార్యదర్శులకు ప్రత్యేక ఉద్యోగ కార్డు అందజేస్తామని, సభ్యులు కూడా ఈ అంశంపై తగిన సూచనలు , సలహాలు ఇవ్వాలని మంత్రి అనిత సూచిస్తూ ...

వాయిస్ ( 28 సెకన్లు)

---

కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. శాసన సమావేశాల్లో భాగంగా విశాఖ మెట్రో రైలుపై సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ, విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టుపై సమగ్ర నివేదికను సిద్ధం చేశామన్నారు. ఇప్పటికే దీన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపామని అక్కడి నుంచి అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామని వివరించారు. విశాఖపట్నంలో మొత్తం 76.90 కిలోమీటర్ల మేర మెట్రో రైలు నిర్మాణం చేపడతామని, రెండు దశలలో 4 కారిడార్లలో మెట్రోను నిర్మిస్తామని మంత్రి నారాయణ వివరించారు.

---

తెలంగాణలోని పెద్దపల్లి జిల్లాలో గూడ్సు రైలు పట్టాలు తప్పడంతో 31 రైళ్లు రద్దు చేయడంతో పాటు 10కి పైగా రైళ్లను ఈరోజు పాక్షికంగా రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. నర్సాపూర్–సికింద్రాబాద్, సికింద్రాబాద్–నాగ్‌పూర్, హైదరాబాద్–సిర్పూర్ కాగజ్‌నగర్, సికింద్రాబాద్–కాగజ్‌నగర్, కాజీపేట–సిర్పూర్ టౌన్, సిర్పూర్ టౌన్–కరీంనగర్, కరీంనగర్–బోధన్, సిర్పూర్ టౌన్–భద్రాచలం రోడ్, భద్రాచలం రోడ్–బల్లార్షా, బల్లార్షా–కాజీపేట, యశ్వంత్‌పూర్–ముజఫర్‌పూర్, కాచిగూడ–నాగర్‌సోల్, కాచిగూడ–కరీంనగర్, సికింద్రాబాద్–రామేశ్వరం, సికింద్రాబాద్–తిరుపతి, ఆదిలాబాద్–పర్లి, అకోలా–పూర్ణ, ఆదిలాబాద్–నాందేడ్, నిజామాబాద్–కాచిగూడ, గుంతకల్లు–బోధన్ రైళ్లను రద్దు చేశామని రైల్వే అధికారులు వెల్లడించారు.

---

రాష్ట్రంలో నిర్వహించనున్న గ్రూప్–2 ప్రధాన పరీక్షను వాయిదా వేసినట్లు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ –ఏపీపీఎస్సీ ఒక ప్రకటనలో తెలిపింది. తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం వచ్చే ఏడాది జనవరి 5న ఈ పరీక్ష జరగాల్సి ఉండగా.. తాజాగా ఫిబ్రవరి 23న ప్రధాన పరీక్షను నిర్వహిస్తామని వెల్లడించింది..

---

ఎన్డీయే కూటమి ప్రభుత్వం చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్టుకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా మైలవరం శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాద్ చింతలపూడి ఎత్తిపోతల పథకం పురోగతి పై అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ, ఈ ప్రాజెక్టు సంబంధించి 934 ఎకరాలు భూసేకరణ చేయాల్సి ఉందని, భూసేకరణను 3

నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. వచ్చే 2 సంవత్సరాల్లో ప్రాజెక్ట్ ను పూర్తి చేస్తామని మంత్రి వివరిస్తూ,

వాయిస్ (25 సెకన్లు)

---------------------------

రాష్ట్రంలో విమానాశ్రయాల విస్తరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. కుప్పం, శ్రీకాకుళం, నాగార్జునసాగర్, తుని – అన్నవరం, తాడేపల్లిగూడెం, ఒంగోలులో విమానాశ్రయాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం పరిశీలిస్తోందని అన్నారు. వాటికి సంబంధించిన ప్రతిపాదనలను ఎయిర్‌పోర్ట్సు అథారిటీ ఆఫ్ ఇండియాకు ఇప్పటికే ప్రభుత్వం పంపిందన్నారు. కొత్త విమానాశ్రయాల నిర్మాణానికి సంబంధించి అందుబాటులో ఉన్న భూముల వివరాలను ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రభుత్వానికి పంపారని మంత్రి వివరించారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం అమలుచేసున్న ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన ద్వారా ఇళ్లపై సౌరశక్తి ఫలకాలను ఏర్పాటు చేసుకోవటం ద్వారా విద్యుత్ బిల్లులను తగ్గించుకోవచ్చని బాపట్ల జిల్లా విద్యుత్ శాఖ సీనియర్ ఇంజనీర్ ఆంజనేయులు అన్నారు. బాపట్లలో సౌరశక్తి పట్ల వినియోగదారులకు నిన్న అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సూర్య ఘర్ పథకం కింద సౌరశక్తి ఫలకాలను ఏర్పాటు చేసుకునే వారికి రాయితీ సబ్సిడీ ఇస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

---------------------------

నేషనల్ కేడెట్ కార్ప్స్–ఎన్.సి.సిలో చేరడం ద్వారా యువత క్రమశిక్షణ, దేశభక్తి అలవర్చుకోవచ్చని తిరుపతి ఎన్.సి.సి.బెటాలియన్ కమాండింగ్ అధికారి కర్నల్ ఆర్.అనూప్. తెలిపారు. తిరుపతిలో ఎన్.సి.సి.బెటాలియన్ కమాండింగ్ కర్నల్‌గా ఈరోజు బాధ్యతలు స్వీకరించి మాట్లాడుతూ, ఎన్.సి.సి.లో చేరే వారి సంఖ్య క్రమేపీ పెరుగుతోందన్నారు. త్రివిధ దళాలపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని చెప్పారు.

---------------------------

వయోజన విద్యకు ప్రోత్సాహం అందించే –ఉల్లాస్ కార్యక్రమం అమలుకు కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రస్థాయిలో ఛైర్మన్‌గా పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి, కన్వీనర్‌గా రాష్ట్ర అక్షరాస్యత మిషన్ డైరెక్టర్‌ను నియమిస్తూ ఈ కమిటీని ఏర్పాటు చేశారు. పురపాలక పట్టణాభివృద్ధి, వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, నైపుణ్యాభివృద్ధి–శిక్షణ, పంచాయతీరాజ్–గ్రామీణాభివృద్ధి, ఐటీ ముఖ్య కార్యదర్శులు, పాఠశాల విద్య డైరెక్టర్, ఐటీసెల్ డైరెక్టర్లను సభ్యులుగా నియమించారు.

---------------------------

కైశిక ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామివారి ఆలయంలో సాలకట్ల కైశిక ద్వాదశి ఆస్థానాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం– టిటిడి ఈరోజు శాస్త్రోక్తంగా నిర్వహించింది. శ్రీమహావిష్ణువును మేల్కొల్పే పర్వదినాన్ని కైశికద్వాదశిగా వ్యవహరిస్తారు. ఈ సందర్భంగా ఉగ్ర శ్రీనివాసమూర్తిని

శ్రీదేవి భూదేవి సమేతంగా సూర్యోదయానికి ముందు మాడవీధులలో ఊరేగించారు. తిరుమల ఆలయంలో కైశికద్వాదశి మహోత్సవాన్ని ప్రతిఏటా ఆనవాయితీగా టిటిడి నిర్వహిస్తుంది.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 116వ సంచిక ఈనెల 24వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 22వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

========================